ప్రజాశక్తి
గురువారం 30 జనవరి 2025 | 5 | అనంతపురం

నేమకల్లు ఆలయానికి రూ 3.7 కోట్లు మంజూరు

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.3.7కోట్లు మంజూరు చేసినట్లు విప్ కాలవ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా పర్యటనలో భాగంగా నేమకల్లుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంజనేయస్వామి సాక్షిగా ప్రజల సమక్షలో ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే అన్నారు. హామీ మేరకు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. ఈ నిధులతో ఆలయ ప్రాకారం, గోపురం, ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సిసి రోడ్డు, మురికికాలువలను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రజల సమక్షంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

కొలిక్కిరాని బిల్లుల వ్యవహారం

- కార్పొరేషన్ అధికారులపై గుత్తేదారుల ఆగ్రహం
- 15వ ఫైనాన్స్ బిల్లుల మంజూరుకు పట్టు
- అకౌంటెంట్ నిర్లక్ష్యంతో రూ.12 కోట్ల నిధులు వెనక్కు
- ఇక్కడ పని చేయలేనంటూ కమిషనర్ నిట్టూర్పు

బిల్లులు చెల్లించాలని అధికారులను నిలదీస్తున్న గుత్తేదారులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో బిల్లుల చెల్లింపు వ్యవహారం కొలిక్కి రావడం లేదు. బిల్లుల చెల్లించాలంటూ బుధవారం కూడా గుత్తేదారులు అధికారులను నిలదీశారు. 15వ ఫైనాన్స్ కింద చేసిన రూ.2.20 కోట్ల బిల్లులను వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్లు పట్టుబట్టారు. బుధవారం రాత్రి 7 గంటల సమయంలో కార్పొరేషన్ అకౌంటెంట్ దేవ శంకర్‌ను చుట్టుముట్టి బిల్లులను ప్రాసెస్ చేయాలని డిమాండ్ చేశారు. ఇతర మున్సిపాల్టీల్లో 15వ ఫైనాన్స్ గ్రాంట్ నిధుల బిల్లులను చెల్లించగా అనంతపురంలో ఎందుకు వెనక్కు పంపారని ప్రశ్నించారు. రాత్రి పొద్దుపోయే వరకు కాంట్రాక్టర్లు బిల్లుల చెల్లింపు విషయంపై అధికారులతో వాదనకు దిగారు. బిల్లుల విషయాన్ని కాంట్రాక్టర్లు కార్పొరేషన్ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారు.

కమిషనర్ బాధ్యల నుంచి తప్పకుంటా..?!

బిల్లుల చెల్లింపునకు సంబంధించి టౌన్ ప్లానింగ్‌లో రామలింగేశ్వర్ లాగిన్‌లోనే ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఆ విభాగ అధికారులు కమిషనర్ మల్లికార్జున రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నిర్ణీత కాల వ్యవధి దాటితే ఫైండ్ టు అప్రూవల్ అవుతాయని చెప్పటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అకౌంటెంట్ విజయ్ కుమార్ నిర్లక్ష్యంగా వ్యవహరించి సిఎఫ్ఎంఎస్‌లోని బిల్లులను చెల్లించకుండా వెనక్కు పంపడం ఏమిటింటూ కమిషనర్ నిలదీశారు. కార్పొరేషన్‌లో ఉద్యోగుల బాధ్యతారాహిత్యం, అసమర్థతతో ఇక్కడ తానుపని చేయలేనంటూ కమిషనర్ మల్లికార్జునరెడ్డి సన్నిహితుల వద్ద వాపోయినట్లు సమాచారం. వీలైనంత త్వరగా కమిషనర్ పోస్ట్ నుంచి వెళ్లిపోవాలని ఆయన నిశ్చయించుకున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆ పోస్ట్‌లో కొనసాగుతారా లేక సర్దుకుని వెళ్లిపోతారా అన్న ప్రశ్న అటు ఉద్యోగులు, ఇటు కాంట్రాక్టర్లలో వ్యక్తం అవుతోంది.

సెలవుల్లో ప్రధాన అధికారులు

కార్పొరేషన్‌లో కీలకమైన అదనపు కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ తదితర ప్రాధాన్యత పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు నెలరోజుల సెలవు ముగిసిన తర్వాత మరో నెల రోజులపాటు సెలవు పొడిగించుకున్నారు. మెడికల్ లీవ్‌లో ఉన్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ విధుల్లోకి వస్తారా లేక మళ్లీ సెలవులును పొడిగించుకుంటారా అన్న దానిపై స్పష్టత లేకుండా ఉంది. ఇలా కార్పొరేషన్‌లో అధికార పాలన మొత్తం అస్తవ్యస్తంగా కన్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పెండింగ్ బిల్లులు ఎప్పటికీ వస్తాయోనని గుత్తేదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

- 3 ఎకరాలు సాగు భూమి, 5 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలి
- వృకాసం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

అనంతపురం జిల్లా వ్యాప్తంగా దళిత కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరి, ఎం.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవార వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏఈవో అలెగ్జాండర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల తొమ్మిది మండలాలు, 34 గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సామాజిక సర్వే నిర్వహించామన్నారు. దళిత కాలనీల్లో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. భూ సమస్యలతో కొన్ని సంవత్సరాల నుంచి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూములు పెత్తందారులు ఆక్రమించుకుంటే వారి భూమి వారి తిరిగి ఇవ్వడం కోసం అనేక సార్లు రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కూడేరు, శింగనమల, పుట్లూరు, ఆత్మకూరు మండలాల్లో శ్మశాన స్థలాలు లేవన్నారు. నార్పల, గుంటకల్లు, గుత్తి, పెద్దవడుగూరు, వజ్రకరూరు మండలాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. దళితులు సాగు చేసుకున్న ప్రభుత్వ భూములను పరిశీలించి వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. ఇళ్లు లేని పేదలకు 5 సెంట్లు గ్రామాల్లో ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలం పిసి ప్యాపిలి గ్రామంలో ఉన్న బసవినీలకు 3 ఎకరాలు సాగు భూమి, 5 సెంట్లు ఇంటి స్థలంతో పాటు ప్రతి సంవత్సరం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షలు ఉచిత రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమశేఖర్, పెద్దయ్య, నాగభూషణం, జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, వెంకట్ చౌదరి, భాస్కర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కరీం సాబ్, పెద్దయ్య, గౌరమ్మ, అరుణమ్మ, పార్వతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుతో ఎంపి అంబికా భేటీ

చంద్రబాబుతో మాట్లాడుతున్న అంబికా

అనంతపురం రూరల్ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో టిడిపి అధినేత నారా చంద్రబాబును ఎంపి అంబికా లక్ష్మీనారాయణ భేటీ అయ్యారు. ఇందులో భాగంగా సహచర ఎంపిలతో రాష్ట్ర ఆర్థిక, అభివృద్ధి తదితర అంశాలపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాల్సిన విషయాలు, సాధించాల్సిన లక్ష్యాల గురించి ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

మంత్రి కేశవ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

జీడిపల్లి-పేరూరు కాలువలకు నిధులివ్వండి

మంత్రిని కోరిన ఎమ్మెల్యే సునీత, పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ భేటి అయ్యారు. బుధవారం నాడు అనంతపురంలోని పయ్యావుల నివాసానికి వెళ్లి పలు అంశాలపై చర్చించారు. జీవో 59 ప్రకారం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్ట్ వరకు 54కిలోమీటర్లు కాలువ తవ్వాల్సి ఉందన్నారు. గత ఐదేళ్లలో ఈ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. పెండింగ్ పనులు, 4 పంపు హౌస్‌ల నిర్మాణాలతో పాటు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి ప్రాజెక్ట్‌ల నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. పేరూరు ప్రాజెక్ట్ కాలువ తవ్వకం కోసం చేసిన 266 ఎకరాల భూ సేకరణ పరిహారం బిల్లులు రూ.14కోట్లు సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారని ఈ నిధులు విడుదల చేయాలన్నారు. కాలువ భూ సేకరణ కోసం రూ.51 కోట్లు బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పేరూరు కాలువ పనులు చేపట్టడానికి రూ.200 కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. హంద్రీనీవాకు సంబంధించి రైతుల కోరిక మేరకు లైనింగ్ బదులు కాలువ వెడల్పు చేయాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో లైనింగ్ చేయాల్సి వస్తే కాలువ గట్లకు ఇరు వైపులా చేసి కింది భాగం వదిలేయాలన్నారు. నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో బాలికల జూనియర్ కాలేజీ మంజూరుకు నిధులు ఇవ్వాలన్నారు. వీటిన్నింటిపై మంత్రి కేశవ్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు.

కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

నిబంధనల సడలింపుపై మంత్రిని కలుస్తా : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రైతాంగాన్ని ఆదుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఏర్పాటు చేసిన పంటల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. బుధవారం పట్టణంలోని 74 ఉడేగోళం సొసైటీలో ఎపి మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రాన్ని విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. బహిరంగ మార్కెట్లో పంట ఉత్పత్తు లకు గిట్టుబాటు ధర లభించని సమయంలో కనీస మద్దతు ధరపై కొనుగోలుకు ప్రభుత్వం చర్య తీసుకొంటోందన్నారు. దానివల్ల బహిరంగ మార్కెట్లో పోటీ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. వరి పంటకోత సమయంలోనూ ఇదేవిధంగా 3 ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టినట్లు తెలిపారు. రైతుల అవసరాల దృష్ట్యా అదనంగా 12,500 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి అనుమతులు ఇచ్చారన్నారు. రైతు సమస్య ల పట్ల ముఖ్యమంత్రి సత్వరం స్పందిస్తారన్నారు. నేడు అనంతపురం జిల్లా వ్యాప్తంగా 70వేల మెట్రిక్ టన్నుల కంది పంట చేతికి రానుండగా, రాయదుర్గం ప్రాంతం నుంచి దాదాపు 5600 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారన్నారు. చాలామంది రైతులు తమ పంట ఉత్పత్తిని కొనుగోలు కేంద్రాలకు విక్రయించడానికి ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటి వరకూ జిల్లావ్యాప్తంగా 45వేల మెట్రిక్ టన్నులు కొనటానికి ఆనుమతి లభించగా కేవలం 4450 మంది మాత్రమే 5603 టన్నుల అమ్మటానికి ముందుకు వచ్చారన్నారు. అదేవిధంగా రాయదుర్గం వ్యాప్తంగా 457 మంది ఏడు వందల టన్నుల కంది అమ్మడానికి రైతు సేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయితే గింజల్లో తేమ శాతం 12 కంటే తక్కువ ఉండాలనే నిబంధనలు కాస్త సడలించాలని రైతులు కోరుతున్నారని, ఈ అంశాన్ని సంబంధిత శాఖా మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎడిఎ లక్ష్మానాయక్, మండల కన్వీనర్ హనుమంతు, వ్యవసాయ అధికారి మహేంద్ర, కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శులు దాదాపీర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అమరవీరుల పారితోషికాన్ని పెంచాలి

ఉరవకొండ : దేశం కోసం అహర్నిశలు కష్టపడి ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలకు అందజేసే పారితోషకాన్ని పెంచాలని ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జవానులు రేయనక.. పగలనకా.. ఎంతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తూ దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం త్రుణప్రాణంగా వదిలే అమరవీరులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్న పారితోషకాలను భారీగా పెంచడానికి ఇటీవల తాను చేస్తున్న ప్రయత్నాలను గుర్తు చేశారు. ఈ విషయంపై ఇప్పటికే తాను ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం, రక్షణ శాఖ మంత్రులు, ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖలు రాశానన్నారు. తాను రాసిన లేఖను మరియు రక్షణ శాఖ నుండి వచ్చిన జవాబు కాపీలను కూడా విలేకరులకు అందించారు. అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి గ్రూప్ స్థాయి ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. వారికి ఇంటి స్థలం కేటాయించి ఇల్లు ప్రభుత్వమే నిర్మించి అందజేయాలని, జవాను స్వగ్రామంలో విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా 'ఫీజు పోరు'

5న అనంతపురంలో ర్యాలీ-వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

విద్యార్థుల ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా వచ్చేనెల 5వతేదీన అనంతపురంలో 'ఫీజుపోరు' నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరికం ఉన్నత చదువులకు అడ్డంకి కాకూడదన్న ఆలోచనతో అప్పటి దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అయితే వైఎస్ జగన్ సిఎం అయ్యాక 1వ తరగతి నుంచి ఇంటర్ వరకూ అమ్మఒడి పథకం అమలు చేశారన్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారి కోసం విద్యాదీవెన, వసతిదీవెన పథకాలు తెచ్చారని చెప్పారు. ఐదేళ్ల జగన్ పాలనలో విద్యారంగానికి రూ.73 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2019లో వైఎస్ జగన్ సీఎం అయ్యేనాటికి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రూ.1780 కోట్లు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందన్నారు. ఆ బకాయిలను రాజకీయ కోణంలో చూడకుండా చెల్లించిన ఘనత వైఎస్ జగన్‌దని తెలిపారు. ఏ ప్రభుత్వాలు మారినా కొన్ని పథకాలకు సంబంధించి బకాయిలు ఉంటాయని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గత ఏడాది మార్చిలోనే రూ.708 కోట్లు విడుదల చేశామని, కానీ అదే సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపుల ప్రక్రియ నిలినిపోయిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా విద్యార్థుల ఫీజులకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. దీని వల్ల కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వైసిపికి 11 సీట్లే వచ్చినా బలమైన ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాటం చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటికే రైతు సమస్యలు, విద్యుత్ చార్జీల పెంపుపై ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3900 కోట్లు చెల్లించాలని, ఇదే డిమాండ్‌తో ఫిబ్రవరి 5వ తేదీన అనంతపురంలో ఫీజు పోరు చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని, ఎవరూ ఆందోళన చెందొద్దని కోరారు. ఇకపోతే కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీల అమలుకు ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, నాగన్న, వైసిపి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సాకే చంద్రశేఖర్, ఎద్దుల అమర్నాథ్‌రెడ్డి, ఓబిరెడ్డి, సైపుల్లా బేగ్, నరసింహులు, చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

జగన్ జమానాలో రూ.10 లక్షల కోట్ల అప్పు

ఏడాదికి రూ.71 వేల కోట్ల భారం

టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి, రూ.10 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి వెళ్లాడని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ విమర్శించారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లను టిడిపి కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఇప్పుడు అప్పులు కూడా పుట్టని స్థితి ఏర్పడిందన్నారు. ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇలాంటివన్ని నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి గుదిబండలా మారిందన్నారు. జగన్ పెట్టిన బకాయిలు డిగ్రీ ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు రూ.2,832 కోట్లు, ఫీజు రీయంబర్స్ మెంట్ రూ. 450 కోట్లు, చిక్కిలు, కోడిగుడ్లకు రూ.256 కోట్లు, వసతి దీవెన రూ.969 కోట్లు, ఆరోగ్య శ్రీ రూ.1800 కోట్లు, ధాన్యం రూ.1600 కోట్లు,ఉద్యోగుల అరియర్స్ రూ.20 వేల కోట్లు, ఇరిగేషన్ కాంట్రాక్టర్లకు రూ.19 వేల కోట్లు, గహ నిర్మాణం రూ.7,800 కోట్లు, ఉపాధి హామీ రూ.2,100 కోట్లు ఇలా మొత్తం జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయి రూ.1.40 లక్షల కోట్లు ఉన్నాయని, ఈ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టలేదన్నారు. తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చు చేసి తినేసిన ఘనుడు జగన్ అన్నారు. విలాసాలు, జల్సాలకు రూ.19,871.35 కోట్లు చేసి జగన్ రికార్డులు సష్టించాడని ఎద్దేవా ఏశారు. జగన్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని కుటుంబ లూటీ రూ.8 లక్షల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారని తెలిపారు. భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ ప్రాజెక్ట్ అనుమతులకు లక్షల కోట్లు కొల్లకొట్టాడని తెలిపారు.ఏపి సచివాలయాన్ని తాకట్టు పెట్టాడని, టీడీఆర్ బాండ్లు స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివాటం చూపారని విమర్శించారు. అప్పులు చెల్లింపు సంక్షేమాభివృద్ధికి నిధుల కేటాయింపు ఉద్యోగ కార్మిక, పెన్షనర్ల జీతభత్యాలు, విద్యా, వైద్యం ఇలా అన్ని రంగాలను రాష్ట్రాన్ని ముందుకు నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డైరెక్టర్ సురేష్

అనంతపురం నేపథ్యంలో 'రాచరికం'

31న విడుదల- డైరెక్టర్ సురేష్, హీరో విజయ్‌శంకర్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం బ్యాక్‌డ్రాప్‌గా రాచరికం సినిమా అద్భుతంగా తెర కెక్కించామని సినిమా డైరెక్టర్ సురేష్ లంకలపల్లి, హీరో విజయ్‌శంకర్, హీరోయిన్ అప్సరా రాణి విజ్ఞప్తి చేశారు. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా బుధవారం అనంతపురంలోని శ్రేయాస్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ మాట్లాడుతూ తాను అనంతపురంలోనే పుట్టి పెరిగానన్నారు. చిన్నపటి నుంచి సినిమా తీయాలని కోరికతో లజ్జో బ్యాక్‌డ్రాప్‌గానే రాచరికం సినిమా చేశానన్నారు. ఈ సినిమా ఈనెల 31వతేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్నట్లు తెలిపారు. నిర్మాత ఈశ్వర్ చాణక్య మాట్లాడుతూ రాచరికం ట్రైలర్ ఇటీవలే విడుదల చేశామన్నారు. అద్భుతమైన స్పందన వస్తోందన్నారు. హీరో విజయ్ శంకర్ మాట్లాడుతూ సినిమా ఫ్యాక్షన్ నేపథ్యం కాకుండా కామెడీ, ఎమోషన్స్ కూడా ఉంటాయన్నారు. 80ల్లో ఫ్యాక్షన్ కాకుండా ఆడవాళ్లకు ఆరోజుల్లో ప్రాధాన్యత ఇచ్చింటే అనే కాన్సెప్ట్ తో సినిమా ఉంటుందన్నారు. హీరోయిన్ అప్సరా రాణి మాట్లాడుతూ సినిమాలో అనంతపురం టవర్‌క్లాక్, ఇతర ప్రాంతాల నేపథ్యం ఉంటుందన్నారు. ట్రైలర్‌కి రెస్పాన్స్ బాగుందని ప్రతి ఒక్కరూ చూసి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విలన్‌గా వరుణ్‌సందేశ్ నటించారన్నారన్నారు.

వికసిత్ 'అనంత' లక్ష్యం

20 సూత్రాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా పరిధిలోని ప్రస్తుత సవాళ్లను అధిగమించి "వికసిత అనంతపురం" లక్ష్యసాధన దిశగా కషి చేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అధికారులకు సూచించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం అనంతపురం జిల్లాలో "కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపైన కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఉపాధి హామీలో మెటీరియల్ కాంపోనెంట్ రూ.201.63 కోట్లలో ఇప్పటి వరకు రూ.115.76 కోట్లు మాత్రమే వ్యయం అయిందని, రూ.85 కోట్లు నిధులు మురిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రణాళికబద్ధంగా ఖర్చు చేయాలని అధికారులకు ఆదేశించారు. "గ్రామీణ సడక్ యోజన" కింద గ్రామాలలో రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరగాలన్నారు. పీఎంఏవై అర్బన్ కింద జిల్లాలో కేటాయించిన గృహ నిర్మాణాలు అన్నింటినీ పూర్తి చేయించాలన్నారు. టిడ్కో గృహాలను వేగవంతం చేయాలన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం అమలులో వేగం పెంచాలన్నారు. పీఎం కృషి సిచ్చాయి యోజన కింద డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లను సబ్సిడీపైన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, సిపిఒ అశోక్ కుమార్, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, డ్వామా పీడీ సలీం బాషా, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న లంకా దినకర్

108 ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

108 ఉద్యోగుల సంఘం నూతన కమిటీ సభ్యులు

ఆంధ్రప్రదేశ్ 108 ఉద్యోగుల సంఘం (సిఐటియు) అనుబంధం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బల్లి కిరణ్‌కుమార్, నరసింహారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, శ్రామిక మహిళా కన్వీనర్ రమాదేవి తెలిపారు. బుధవారం గణేనాయక్ భవన్‌లో 108 ఉద్యోగుల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 ఉద్యోగుల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించారు. అనంతరం 108 ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. 108 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పి.నాగేంద్ర, సి.జయరాజు, జిల్లా కోశాధికారి పి.నాగభూషణం, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కెవిఎస్.మారుతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.సుంకన్న, ఉపాధ్యక్షులు రామినేని పల్లి రాము, వన్నూరు స్వామి, సహాయ కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, మహేష్, కొండయ్య, మహిళా కన్వీనర్ రాజేశ్వరి, కమిటీ సభ్యులుగా ఆరు మందిని ఎన్నుకున్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం

సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి రాజామోహన్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అదనపు భారాలు మోపేలా అమర్చుతున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను వినియోగదారులందరూ వ్యతిరేకిద్దామని సిటిజన్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి ఎ.జి.రాజామోహన్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను పూర్తిగా కైవశం చేసుకోవడం కోసం అదాని కంపెనీ రంగంలో ప్రవేశించిందన్నారు. అనంతపురం నగరంలోని కొన్ని ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్లు ఉచితంగా ఏర్పాటు చేస్తామని ఇంటింటికి ఆ సంస్థ ఉద్యోగులు వస్తున్నారని తెలిపారు. ఇప్పుడే చేయించుకోండి లేదంటే ఆ తర్వాత రూ.5 వేలతో మీరే బిగించుకోవాల్సి వస్తుందని బెదిరిస్తున్నారని తెలిపారు. ఏమాత్రం వినియోగదారులకు హెచ్చరికలు కానీ సూచనలు కానీ లేకుండా ట్రాన్స్‌కో అధికారులు ఈ పనిని చేయడం చట్ట పరిధిని అతిక్రమించడమే అవుతుందన్నారు. తక్షణమే ఈ చర్యలని నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వినియోగదారులకు తీవ్ర నష్టాన్ని తెచ్చే ఈ మీటర్ల ఏర్పాటును ప్రజలు వ్యతిరేకించాలని అదాని కంపెనీ స్మార్ట్ మీటర్లు రాబోవు కాలంలో మన యొక్క వ్యక్తి చార్జీలని మరింత ఎక్కువగా చేస్తాయని తెలిపారు. ప్రజలు విద్యుత్తు పైన ఉండే హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని, ఆ కారణంగా చైతన్యవంతమై మీ ఇళ్ల దగ్గరకు అలాంటి ఉద్యోగులు సిబ్బంది వస్తే నివారించి మీటర్‌లు బిగించుకోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎన్.వంశీకృష్ణ

ప్రజాశక్తి-రాయదుర్గం

అనంతపురంలో నారాయణ కళాశాలలో ఫీజుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎన్.వంశీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థి మరణానికి కారణమైన నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని, నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారాయణను పదవి నుంచి తొలగించాలన్నారు. మరణించిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని పోరాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులను ఉపయోగించి అరెస్టు చేయడం బాధాకరమన్నారు. అలసత్వం వహిస్తున్న అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. నాలుగు రోజుల నుంచి విద్యార్థి సంఘాలు పోరాడుతుంటే, ప్రభుత్వంగానీ, విద్యాశాఖ మంత్రిగానీ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యార్థి మృతికి కారణమైన నారాయణ విద్యాసంస్థలను మూసివేయాలని, నారాయణను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

పలువురు మైనార్టీలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-ఉరవకొండ

టిడిపిలో చేరిన పలువురు మైనారిటీలు

పట్టణానికి చెందిన పలువురు మైనారిటీలు బుధవారం టిడిపిలో చేరారు. ఇందులో భాగంగా టిడిపి నేత పయ్యావుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైసిపి మైనారిటీ నాయకులు హోతూరు బోరుగుల బాషా, హోసూరు సద్దామ్, జిఎంఎస్.షాకీర్, బొజ్జల్లి కుమారుడు యూసుఫ్ (అరటికాయ మండి) పామిడి సలీం (మండల కో అప్షన్ సభ్యుడు), పామిడి తయ్యూబ్, పామిడి నిజాం, ముల్లా యూనుస్, పామిడి పిట్టి నూర్, మద్దికెర అన్వర్‌బాషా తదితరులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పట్టణంలో గత ఐదేళ్లలో మంచినీరు, రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, మైనార్టీ సమస్యలు పరిష్కారం అయిన పాపానపోలేదన్నారు. అయితే ఆయా సమస్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ సోదరులు ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పాటిల్ నిరంజన్‌గౌడ్, పట్టణ మైనారిటీ నాయకులు ఖలందర్, రహరుల్లా, మెకానిక్ రెహమాన్, జియో అనిల్, కళ్యాణదుర్గం ఆసీం, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వజ్రకరూరు సర్పంచు మోనాలిసా సూచించారు. బుధవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని జనార్ధన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో మహిళా చట్టాలపై జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ మహిళలు విద్య, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలంటే ప్రతి ఒక్కరూ కాలానుగుణంగా పరిస్థితులు అంచనా వేసుకుంటూ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. మహిళలు అభివృద్ధి చెందినట్లయితే ఆ కుటుంబం అన్నిరంగాల్లో అభివృద్ధిని సాధించినట్లేనన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ అడ్వకేట్ డి.లీలావతి, కుమారి జహారాబి, వెలుగు, ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా, అనంతపురం జిల్లా చిన్న పొడమల గ్రామంలో డోర్ నెంబర్ 3-66-4 నందు నివశించు శ్రీమతి జి.వకులాదేవి W/O భర్త జి.గోపాల్ అను ఆమెకు హక్కు అనుభవము గల క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని ఏదైనా బ్యాంకు నందు ఆయకము ఉంచి రుణమును పొందవలెనని అనుకున్నారు. అయితే శ్రీమతి జి.వకులాదేవి W/O జి.గోపాల్ గారికి సంబంధించిన క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థికి సంబంధించి ఒరిజినల్ లింకు పత్రము శ్రీ అనంతపురం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం.2529/1972 గా రిజిష్టరు కాబడినది. సదరు పత్రమును శ్రీమతి జి.వకులాదేవి గారు జిరాక్స్ చేయించుకొను నిమిత్తము తీసుకుని వెళుతుండగా పోగొట్టుకుని పోయినది. కావున ప్రస్తుతము తన వద్ద నకలు పత్రములు మాత్రమే ఉన్నవని తెలిపియున్నారు. కావున ఎవరికైనా క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని గురించి ఎలాంటి విక్రయములు గాని, తకరార్లు గాని, ఆయకములు గాని ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 10 నుండి 15 రోజుల వ్యవధిలోపు నాకు తెలియజేయ గోరుచుకున్నాను. పైన తెలిపిన 15 రోజుల గడువులోపల షెడ్యూలు దాఖలా ఆస్థిని గురించి ఎలాంటి ఆక్షేపణలు రాని యెడల పై తెలిపిన జి.వకులాదేవి W/O జి.గోపాల్ గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థికి సంబంధించి తన పేరు ఉన్న ఒరిజినల్ పత్రములు ఏదైనా బ్యాంకులో డిపాజిట్ చేసి రుణమను పొందుదురని తెలుపడమైనది.

షెడ్యూలు

అనంతపురం రెవెన్యూ డివిజన్ అనంతపురం సబ్ డివిజన్‌కు చేరిన అనంతపురం రూరల్ గ్రామ పొలంలో శ్రీమతి జి.వకులాదేవి గారి హక్కు అనుభవం గల ఆస్థి

బాబు	వివరం	సర్వే నెంబర్	ఏ.సి	ఏ.సి	హెస్.ఎస్	ప్లాట్ నెంబర్
సర్కారు	ఖుష్కీ	398	11.48పైకి,	0.05.05,	0.020,	102

ఇందుకు చెక్కుబంది:

తూర్పు: ప్లాటు నెంబరు 115

దక్షిణం: ప్లాటు నెంబరు 101

పడమర: రోడ్డు

ఉత్తరం: ప్లాటు నెంబరు 103

ఈ మధ్యగల **తూర్పు-పడమర** 55 అడుగులు లేక 16.76 మీటర్లు, **ఉత్తర- దక్షిణం** 40 అడుగులు లేక 12.19 మీటర్లు, ఈ విశాలం గల ఐదు పాయింట్ సున్నా ఐదు సెంట్లు లేక 244.44 చదరపు సెంట్లు గల ప్లాటు నెంబరు 102 మాత్రము

ఇట్లు

తమరి విధేయురాలు

జి.వకులాదేవి,

అడ్వకేట్స్

డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి : ఎంవిఐ

ప్రజాశక్తి-రాయదుర్గం

మాట్లాడుతున్న రాయదుర్గం ఎంవిఐ వై.విశ్వనాథ్‌రెడ్డి

వాహనాలు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ వై.విశ్వనాథ్‌రెడ్డి కోరారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయంలో పాఠశాలల బస్సు డ్రైవర్లు, సహాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ మధ్య జరిగిన స్కూల్ బస్సు ప్రమాదం పరిశీలిస్తే స్పష్టం అవుతుందన్నారు. డ్రైవింగ్‌పై నిర్లక్ష్యం చేస్తే డ్రైవర్లతోపాటు స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవర్లు అందరూ వాహనాలు నడిపేటప్పుడు పూర్తి ఏకాగ్రతతో వ్యవహరించాలని సూచించారు. ఉదయమే వాహనం బయలుదేరినప్పుడు వాహనానికి సంబంధించిన బ్రేకులు, టైర్లు, స్టీరింగ్‌ను పరిశీలించుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే వాహనాన్ని నిలుపుకోవాలన్నారు. అదేవిధంగా వాహన సామర్థ్యాన్ని మించి ఎక్కించుకోకూడదన్నారు. మద్యం, మత్తు పదార్థాలు తీసుకుని వాహనాలను నడిపిడే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంతోపాటు ఉద్దేహాల్, గోవిందవాడ, గోనేహాల్ క్రాస్‌లో ఉన్న ప్రయివేటు పాఠశాలల బస్సులను ఎస్ఐ నబీరసూల్ బుధవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వాహనాలకు సంబంధించిన ఆర్‌సిలు, బీమా, డ్రైవర్ల లైసెన్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎక్కడైనా... ఏదైనా రహదారులు సరిగా లేకపోతే పాఠశాల బస్సులను నడపరాదన్నారు. అలాంటి స్థలాలకు చిన్న వాహనాలను పంపి విద్యార్థులను ఇబ్బందులు లేకుండా తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం: అనంతపురంలోని పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ దాసరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రయివేటు పాఠశాలలు, కళాశాల వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బస్సు డ్రైవర్లు ప్రమాదాలను ఎలా నివారించాలి? వాహనాలను సురక్షితంగా నడిపే మార్గదర్శకాలు ఏమిటి? అనే అంశాలపై వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, బాలాజీ విద్యాసంస్థల ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌ఛార్జి కొండారెడ్డి, ఎఒ మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఆయాల సంఖ్య పెంచాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

కమిషనర్‌తో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయాలను నియమించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని కలిసి కళాశాలలో పని చేస్తున్న ఆయాల సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయాలను నియమించకుండా కేవలం ముగ్గురు ఆయాలతో గొడ్డుచాకిరీ చేయించుకుంటున్నారన్నారు. అంతేగాకుండా మహిళా కార్మికులని కూడా చూడకుండా పురుషులు చేయాల్సిన పనులు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల పేరుతో ఆయాలతో గొడ్డు చాకిరి చేయించుకోవడం ఎంత మేరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా ఆయాలను పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాము, వంశీకృష్ణ, నాయకులు భరత్‌కుమార్, ఆయాలు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-గుత్తి

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మండలంలోని చెర్లోపల్లి పంచాయతీలో ఉన్న సేవాఘడ్‌లో వచ్చేనెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దామని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజనేయులు, ఆర్డీఓ శ్రీనివాస్, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం సేవాఘడ్‌లోని టిటిడి కల్యాణమండపంలో సేవాలాల్ జయంతి ఉత్సవ ఏర్పాట్లపై సేవాఘడ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థనాయక్, తహశీల్దార్లు డి.ఓబిలేసు, రమాదేవి, మండల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ముందుగా సేవాఘడ్‌కు వచ్చిన అధికారులకు ట్రస్టు సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సేవాలాల్ మహరాజ్, మాతా జగదాంబ ఆలయంలో అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తుల ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భక్తులు వచ్చేందుకు గుత్తి, గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండల నుంచి బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు ఆదేశించారు. అదే విధంగా భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, తాత్కాలికంగా స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వీటితోపాటు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు అప్పా వెంకటేష్, సిఐలు బి.వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన

అనంతపురం : నారాయణ కళాశాలలతోపాటు ఆర్ఐఒపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంత్రి నారాయణని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నగరంలో దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌విఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చక్రధర్‌యాదవ్, ఎపి విద్యార్థి జెఎసి జిల్లా అధ్యక్షులు అమర్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, భరత్, హర్ష, మురళి, ఎర్రిస్వామి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

6న చలో హైదరాబాద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

డప్పు కొడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వచ్చేనెల 6న తలపెట్టిన లక్ష డప్పులు- వేల గొంతులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి మాదిగలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ పిలుపునిచ్చారు. బుధవారం రాచానపల్లి, సిండికేట్ నగర్, ధర్మభిక్షం కాలనీలలో ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో డబ్బు కొడుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి, వర్గీకరణ అమలు తర్వాతనే ఉద్యోగాలు, విద్యార్థుల సీట్లు, సంక్షేమ పథకాలు తదితర డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ పోరాటం చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా " హలో మాదిగ, మాదిగ ఉపకులాలు లక్షల డబ్బులు - వేల గొంతులు భారీ సాంస్కృతిక ఆయుధ ప్రదర్శనకు ప్రతి జిల్లా నుండి ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల కమిటీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, కళాకారులు వేలాదిగా ఫిబ్రవరి 6న హైదరాబాద్‌కు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ

ఉరవకొండ : మండల కేంద్రంలోని తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొననున్నారు. అనంతరం రాగులుపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల పరిశీలించనున్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

పుట్లూరు : మండలంలోని అన్నిగ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ అలివేలమ్మ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. అదేవిధంగా మినీ గోకులాలను త్వరగా పూర్తి చేయించాలన్నారు. ఇంకుడు గుంతలు తీయించడం, అమృత సరోవరం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ నరేంద్ర, టిఎలు, బిఎఫ్‌టిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

కలెక్టర్ వినోద్‌కుమార్‌తో రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు

నూతనంగా ఎన్నికైన రెవెన్యూ ఎంప్లాయీస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ సభ్యులు కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా కలెక్టర్‌కు శాలువా కప్పి సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఎంప్లాయీస్ స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌని సంజీవరెడ్డి, సెక్రటరీ పుట్లూరు హరిప్రసాద్‌రెడ్డి, ట్రెజరర్ కె.శ్రీనివాసమూర్తి, వైస్ ప్రెసిడెంట్లు టి.హరిప్రసాద్, ఎన్.చంద్రరేఖ, పి.మారుతీప్రసాద్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు దాసరి భరత్‌కుమార్, పి.నారాయణస్వామి, ఎస్.షాహిద్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పరిశీలన

తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని పలుగ్రామాల్లో సాగు చేసిన పండ్లతోటలను ప్రకృతి వ్యవసాయ పరిశోధకులు బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలోని వరదాయపల్లి, ఎర్రగుంటపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన చీనీ, అరటి, ఎటిఎం అంజూర, నిమ్మ, మునగ, సీతాఫలం, తదితర పండ్ల మోడల్ సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడి వచ్చేలా తగు సూచనలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సాధికార సంస్థ ప్రతినిధులు విజయ్‌కుమార్, లక్ష్మానాయక్, శ్రీలంక దేశ పరిశోధకులు, జడ్పీఎన్ఎఫ్ సిబ్బంది రవీంద్ర, లక్ష్మీనారాయణరెడ్డి, రెడ్డి రమేష్, గంగాధర్, రామ్మోహన్, సుబ్బలక్ష్మి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్‌సిసి విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బెస్ట్ ఎన్‌సిసి కంటింజెంట్ అవార్డు పొందిన ఎన్‌సిసి విద్యార్థులను ఎన్‌సిసి అధికారులు అభినందించారు. అనంతపురం 6(ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కులకర్ణి, ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఐటీఐ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్‌లతోపాటు ఎన్‌సిసి అధికారులు మురళి, రామాంజినేయులు, జగదీష్ విజేతలుగా నిలిచారు. దీంతో అధికారులు అభినందించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

గుత్తి : గుత్తి కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని సభా మందిరంలో జరిగే సమావేశంలో పలు అంశాలపై సభ్యులు, అధికారులు చర్చించనున్నట్లు చెప్పారు.

జైకిసాన్ నాగమల్లి ఓబులేసుకు సన్మానం



ఓబులేసును సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ : గణతంత్ర దినోత్సవం వేడుకల్లో అవార్డు స్వీకరించిన జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసును బుధవారం ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మమత, సీనియర్ అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఖాదర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరారెడ్డిపల్లిలో 'పొలం పిలుస్తోంది'

యాడికి : మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నుంచి పంటను కాపాడుకోవాలన్నారు. ఇందుకోసం క్లోరిఫైరిఫాస్ 20శాతం, ఇ.సి.2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వీటితోపాటు తాము సూచించిన మందులను పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి లలిత, రిలయన్స్ అధికార ప్రతినిధి గిరిబాబు, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని బోరంపల్లి గ్రామ సచివాలయంలో క్లాప్‌మిత్రగా పని చేస్తున్న అంజినప్ప మంగళవారం రాత్రి మృతిచెందారు. బుధవారం విషయం తెలుసుకున్న సర్పంచు శోభారాణి భర్త సోమశేఖరెడ్డి, వైసిపి నాయకులు కృష్ణారెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

విద్యార్థులకు మెటీరియల్ అందజేత

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం మారంపల్లి కాలనీలోని ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ గుజ్జుల హేమలత బుధవారం మెటీరియల్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజినల్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, ప్రిన్సిపాల్ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ కుళ్లాయిస్వామి నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ఆత్మకూరు : మండలంలోని పి.యాలేరు గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ లక్ష్మీనరసింహా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి ఆదాయాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, శ్రీనాథ్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత వివరాలను సరి చేసుకోండి

అనంతపురం సిటీ : జిల్లాలోని ఉపాధ్యాయులు వ్యక్తిగత వివరాలను టిఐఎస్ లాగిన్‌లో ఈనెల 31వతేదీ వరకూ సరిచేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిఆర్ఎస్ లాగిన్‌లో అర్హతల ఆధారంగా వారికి పదోన్నతులు, బదిలీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎఎస్ లాగిన్‌లో ఏవైనా మార్పులు ఉంటే సరి చేసుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

సీనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకున్న లక్ష్మిపతిరెడ్డి

బుక్కరాయసముద్రం : కుటుంబ కలహాలతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దయ్యాలకుంటపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... బుక్కరాయసముద్రంకు చెందిన లక్ష్మిపతి రెడ్డి(45) కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన గొటుకూరు గ్రామానికి చెందిన కృష్ణవేణిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనారోగ్య సమస్యలతో లక్ష్మిపతి రెడ్డి భార్య కృష్ణవేణి మరణించింది. ఆమె మరణానంతరం లక్ష్మిపతిరెడ్డి చెల్లెలు కూతురు శ్రీవాణిని రెండో వివాహం చేసుకున్నాడు. ఈమెకు ఒక కూతురు ఉంది. కాగా మొదటి భార్య కృష్ణవేణి తల్లిదండ్రులు, విశ్వనాథ రెడ్డికి ఇటీవల ఆస్తి విషయంలో మనస్పర్థలు ఏర్పాడ్డాయి. ఆస్తి కోసం మొదటి భార్య కుటుంబ సభ్యులు డిమాండ్ చేయడంతో విశ్వనాథరెడ్డి మానసిక ఆందోళనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం దయ్యాల కుంటపల్లి గ్రామ సమీపంలోని నరసమ్మ గుడి సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డి.హీరేహాల్ : మండల కేంద్రంలోని అంతర రాష్ట్ర రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోవింద్‌రెడ్డి మృతి చెందినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు డి.హీరేహాల్‌కు చెందిన గోవిందరెడ్డి ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్తుండగా, బళ్లారి నుంచి రాంపురం వెళుతున్న ఆటోను ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్ర గాయాలపాలైన గోవింద్‌రెడ్డిని వెంటనే చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతచెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

లారీల్లో డీజిల్ చోరీ

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారి పక్కన ఆపిన రెండు లారీల్లో నుంచి 800 లీటర్ల డీజిల్ ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. లారీ డ్రైవర్లు తెలిపిన మేరకు బెంగళూరు నుంచి హైదరాబాద్ కు లోడుతో వెళ్తూ నిద్ర రావడంతో డ్రైవర్లు షాజాద్, అంబ్రీష్ లు లారీని బాచుపల్లి శివారులోని పెట్రోల్ బంకు వద్ద ఆపి పడుకున్నారు. ఉదయం లేచి చూడగా డీజల్ ట్యాంకులకు ఉన్న మూతలు తెరిచిఉండి డీజల్ కింద పడి ఉండటంతో అనుమానం వచ్చింది. వెంటనే ట్యాంకులను పరిశీలించగా డీజల్ చోరీకి గురి అయినట్లు గుర్తించారు.అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు లారీలలో రూ.80 వేలు విలువ చేసే 800 లీటర్ల డీజల్ చోరీకి గురైందని డ్రైవర్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మామిడి చెట్లు, గడ్డివాములు దగ్ధం

మంటలను ఆర్పుతున్న స్థానికులు

బ్రహ్మసముద్రం : రెండో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో మామిడి చెట్లు, గడ్డివాములు దగ్ధమయ్యాయి. బాధిత రైతులు గొల్ల జయరాములు, సూరయ్య గారి ఎరిస్వామి తెలిపిన వివరాల మేకు.. బైరసముద్రం గ్రామానికి చెందిన సూరయ్య గారి ఎర్రిస్వామి ఇటీవలే తన వ్యవసాయ పొలంలో పండిన వేరుశనగను వామిగా వేసుకున్నాడు. ఈనేపథ్యంలో ప్రమాదవశాత్తు వామికి నిప్పు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. దీంతో సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని వాపోయాడు. అలాగే తిప్పయ్యదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల జయరాములుకు చెందిన 500 వక్కచెట్లు, 250 మామిడి చెట్లు కాలిపోయాయి. దీంతోపాటు పది కట్టల డ్రిప్పు పైపు దగ్ధమైంది. దీంతో సుమారు రూ.1.50లక్షల నష్టం జరిగిందని రైతు వాపోయాడు. ప్రభుత్వ ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న మోహన్‌నాయక్

'నారాయణ'పై చర్యలు తీసుకోవాలి

పామిడి : విద్యార్థులను వేధించి ఆత్మహత్యలకు కారణమవుతున్న నారాయణ విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ఇటీవల అనంతపురం సమీపంలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న చరణ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణ కళాశాల యాజమాన్యంపై కేసులు నమోదు చేయడంతోపాటు చరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రాము, గోవింద, గోపీకృష్ణ, భాస్కర్, చంటి, మణికంఠ, రాజు, బాషా, రాజశేఖర్, అనిల్‌కుమార్, ధరణినాయక్, మనోజ్‌నాయక్, పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ

పుట్లూరు : మండలంలో రూ.15వేల పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారును బుధవారం ప్రత్యేక వైద్య బృందం పరిశీలించింది. ఇందులో భాగంగా ప్రత్యేక వైద్యబృందం డాక్టర్లు శివకుమార్, స్వర్ణకుమారి కలిసి మండలంలో దాదాపు 35 మంది పింఛన్‌దారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, డాక్టర్ హిమబిందు, వైద్య, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమాఖ్య కమిటీ భవనం ప్రారంభం

పామిడి : మండలంలోని కొండాపురం రోడ్డు వద్ద నిర్మించిన విశాల ఫెర్రర్ వికలాంగుల మండల సమైక్య కమిటీ నూతన భవనాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు వికలాంగుల మండల సమైక్య కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రటకనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

అనంతపురం : రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను చిన్నహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యాయులు మునీంద్ర, మస్తాన్‌వలి, రజనీకుమారి, పీడీ ప్రభాకర్, నారాయణస్వామి, కృష్ణ, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై సమీక్ష

ఉరవకొండ : ఈ-పంట నమోదుపై రైతు సేవా కేంద్రం సిబ్బందికి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి శుభకర్ సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన ప్రతి పంటనూ నమోదు చేయాలన్నారు. అంతేగాకుండా రైతుల నుంచి ఇకెవైసి సేకరించాలన్నారు. అలాగే శనగ, కంది పంటల్లో పంట కోత ప్రయోగాలు చేయాలన్నారు. పిఎం కిసాన్ పథకంలో కొత్తగా నమోదు చేసుకున్న రైతుల పూర్తి వివరాలను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ భరత్, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఒ శుభకర్

ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తాం

ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే ప్రభుత్వ విధానాలపై ఉద్యమిస్తామని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బి.నరసింహులు, జల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్ రాయల్, ఎస్.సిరాజుద్దీన్‌లు తెలిపారు. బుధవారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం 117 జిఒ రద్దు స్థానంలో చేపడుతున్న ప్రక్రియను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం గ్రామీణ విద్యా రంగాన్ని విచ్ఛిన్నం చేసిన 117 జిఒతో వేలాది పాఠశాలలో మూతబడి గ్రామీణ విద్యా రంగం విచ్ఛిన్నం అయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మెమో పేరుతో అంతకన్నా తీవ్ర నష్టాన్ని మోసుకొస్తున్న ప్రత్యామ్నాయ విధానంతో ఉన్న ప్రాథమిక పాఠశాలను కూడా ఆదర్శ ప్రాథమిక పాఠశాలల పేరుతో

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు

సుదూర ప్రాంతంలోని గ్రామీణ పాఠశాలలో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఆదర్శ పాఠశాలలకు వెళ్లలేక వేలాదిగా డ్రాప్ ఔట్స్‌కి గురై వీధిన పడే ప్రమాదం ఉందన్నారు. మెమో పేరుతో జీవనోపాధి కోసం బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విధిలేక వారి తల్లి దండ్రులతో పక్క రాష్ట్రాలకు వలస వెళ్లిన విద్యార్థుల పేర్లను పాఠశాల నుంచి మూకుమ్మడిగా తొలగించడం సరైన విధానం కాదన్నారు. ప్రత్యామ్నాయంగా 3,4,5 తరగతులను యథావిధిగా ప్రాథమిక పాఠశాలలోకి కలిపి పూర్వస్థితిని పునర్ నిర్మించాలని ఉపాధ్యాయ సంఘాలన్ని కోరుతుంటే ప్రభుత్వ అధినేతల మెప్పుకోసమే మెమోలో అనేక అసంబద్ధ మార్పులకు ప్రోత్సహించడం సరికాదన్నారు. వసతుల కొరత పేరుతో ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేయడం, విద్యార్థుల సంఖ్యా బలం పేరుతో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు రద్దు చేయడం, ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే బోధన పేరుతో వేలాది పాఠశాల సహాయకుల పోస్టులను రద్దు పరచడం వంటి చర్యలు ఉప సంహరించాలన్నారు. 117 జిఒ కన్నా మునుపటి యథాస్థితి పాఠశాల విద్యా విధానాన్ని మాత్రమే పునర్ నిర్మించాలని కోరారు.

రంగనాథ స్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో వచ్చేనెల 6 నుంచి 14వతేదీ వరకూ నిర్వహించనున్న బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీఓ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ డి.ఓబిలేసు, ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, సిఐ బి.వెంకటేశ్వర్లుతో కలిసి గ్రామంలో పర్యటించి వాహనాల పార్కింగ్, దుకాణాల ఏర్పాటు, రథోత్సవం జరిగే ప్రాంతాలను పరిశీలించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఇఒ రామాంజనేయులు వివరించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. గ్రామానికి వచ్చిన అధికారులు బొలికొండ రంగనాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామిపై ఉంచిన వస్త్రాలను, తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

3న టెంకాయల విక్రయ హక్కుకు వేలం

తొండపాడులో వెలిసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఫిబ్రవరి 6నుంచి 14 వరకూ మాఘమాసంలో జరిగే రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు (తిరునాల) సందర్భంగా ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయ హక్కుకు వచ్చేనెల 3న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సి.రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల టెంకాయల వేలంపాటతో పాటుగా ఫిబ్రవరి15 నుంచి 2026 పుష్యమాసం నెల ఆఖరు వరకూ ఏడాది పాటు టెంకాయల విక్రయానికి అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు వేలం పాట ఉంటుందని తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు దేవాలయ అధికారి వద్ద రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ఎమ్మెల్యే జయరామ్ వ్యాఖ్యలు దురదృష్టకరం

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టులపై గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ వ్యాఖ్యలు దురదృష్టకరమని వైఎస్ఆర్‌సి సీనియర్ నాయకుడు, గోరంట్ల జడ్పీటిసి పాలే జయరామ్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. గుంతకల్లు టిడిపి ఎమ్మెల్యే తప్పుడు వార్తలు రాస్తే రైలు పట్టాల మీద పడేస్తా అని బెదిరించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి అనుభవించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసి టిడిపి తీర్థం పుచ్చుకొని ఎమ్మెల్యేగా అయ్యి పదవి అహంకారంతో జర్నలిస్టులపై ఇలా మాట్లాడడం సబబు కాదన్నారు. జర్నలిస్టులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జిఎస్ఎల్‌వి-ఎఫ్15 విజయవంతంపై హర్షం

బెలుగుప్ప : భారత అంతరిక్ష సంస్థ ఇస్రో శ్రీహరి కోట నుంచి బుధవారం ప్రయోగించిన జిఎస్ఎల్‌వి-ఎఫ్15 శాటిలైట్ (100వ ప్రయోగం) దిగ్విజయంగా నింగిలోకి దూసుకెళ్లగానే మండలంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో శాటిలైట్ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ మారెన్న, విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, డైరెక్టర్లు నాగభూషణం, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు, గొల్లపల్లి గ్రామాల్లో పశు వైద్యాధికారులు బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాల ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమాల్లో గూగూడు సర్పంచు రమణకుమారి, ఎంపిటిసి రాజారెడ్డి, టిడిపి నేత ఓబులేసు, పశుసంవర్ధక సహాయకులు సంధ్య, రమణి, ప్రణతి, మహాలక్ష్మి, అరుణ్ జ్యోతి, రామాంజినమ్మ, అంకిత, ప్రవల్లిక, ఓంకుమార్, గంగాధర్, గోపాలామిత్ర రాజారెడ్డి, రామునాయుడు, కాటమయ్య, రరసప్ప, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల మండలంలో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

బెలుగుప్ప : మండల పరిధిలోని శ్రీరంగపురం, వెంకటాద్రిపల్లి గ్రామాల్లో బుధవారం పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పశువులకు టీకాలు వేశారు. అనంతరం పశువులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్, డాక్టర్ స్రవంతి, సత్యసాయి సేవా సమితి సేవకులు ఓంప్రకాష్, టిడిపి నాయకులు సునీల్‌చౌదరి, జయరామ్‌చౌదరి, గోపాల్, రాజు, వలి, హాజీవలి, సోమశేఖర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప మండలంలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని బుడిమేపల్లి, నంజాపురం గ్రామాల్లో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది ప్రియాంక, భానుప్రియ, రమణానాయక్, సుధీర్, నవీన్, గీత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల పరిధిలోని కోటక గ్రామంలో పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుభాన్, నాగరాజు, తిరుపాలు, సురేంద్ర పాల్గొన్నారు.

ఏకలవ్య విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎరుకల కులస్తుల ఆరాధ్యదైవం ఏకలవ్య విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎపి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్ కోరారు. ఈమేరకు బుధవారం ఎరుకల సేవాసంఘం ఆధ్వర్యంలో ఉరవకొండ గ్రామ పంచాయతీ ఇఒ గౌస్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎపి ఎరుకుల సేవాసంఘం నియోజవర్గ అధ్యక్షులు సాకే వసంత్, ప్రధాన కార్యదర్శి సాకే పురుషోత్తం, టౌన్ ప్రెసిడెంట్ వీరేంద్ర, ఎరుకుల వీరేష్, గంగన్న, అజ్జప్ప, రాజు, ఎర్రిస్వామి, ఎరుకుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆరుబయట మలవిసర్జన చేయొద్దు

బొమ్మనహాల్ : ఆరుబయట మల విసర్జన నేరం అని ఎంపిడిఒ విజయభాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ ఆరుబయట మలవిసర్జన చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఇళ్లల్లోని మరుగుదొడ్లను వినియోగంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ కణేకల్ ప్రాజెక్టు ఆఫీసర్ ఇన్‌ఛార్జి లక్ష్మీప్రసన్న, ఇఒఆర్‌డి దేవదాస్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కుమారి, నాగకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ విజయభాస్కర్